పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్షలు 7
- తప్పనిసరి చేస్తూ కఠిన చట్టం తేవాలి
- ప్రభుత్వానికి డాక్టర్ భరత్‌రాజ్ వినతి
- 500 మంది పెళ్లిళ్లు రద్దు చేశానన్న వైద్యుడు

నిదానంఘూ..!

- రాష్ట్రంలో విఫలమవుతున్న ఇంటెలిజెన్స్ విభాగం
- పక్క రాష్ట్రాల అధికారులు దాడులు చేశాక హడావుడి
- అనుమానిత ఉగ్ర మహిళను అరెస్ట్ చేసిన గుజరాత్ పోలీసులు
- భారీడ్రగ్స్ తయారీ యూనిట్‌ను గుర్తించిన మహారాష్ట్ర బృందం
- ఆర్‌సీబీ విజయోత్సవాల దుర్ఘటనలోనూ వైఫల్యం



బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏకంగా పక్క రాష్ట్రాల అధికారులు చేసేదాకా ఇక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. అంతా అయ్యాక హడావుడి చేస్తున్నారు. సమాజంలో హింసాత్మక, ఉగ్రవాద, డ్రగ్స్ వ్యవహారాలపై నిరంతరంగా నిఘా పెట్టి ఎప్పటికప్పుడు కట్టడిచేసేలా వ్యవహరించేందుకు రాష్ట్ర పోలీసు శాఖకు అనుబంధంగా ఇంటెలిజెన్స్ విభాగం పనిచేస్తోంది. దేశంలో అయినా రాష్ట్రంలోను ఇంటెలిజెన్స్ విభాగం అత్యంత అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు హింసకు తావు లేకుండా పనిచేయాల్సి ఉంటుంది. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలను పరిశీలిస్తే పోలీసు విభాగం పూర్తిగా నిర్లక్ష్యమవుతోందనే విమర్శలను ఎదుర్కొంటోంది. కొన్ని నెలల వ్యవధిలోనే రాష్ట్ర పోలీసుల వైఫల్యాలకు స్వయంగా హోంమంత్రి పరమేశ్వర్ కూడా తమ తప్పిదం ఉందని ప్రకటించాల్సి వచ్చింది. జూన్ 3న ఐపీఎల్ టోర్నమెంట్‌లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించింది. మరుసటి రోజున ఆర్‌సీబీ, చిన్నస్వామి స్టేడియంకు అనుబంధమైన కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌తో పాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు 4వ తేదీన విజయోత్సవాలు జరిపేందుకు సిద్ధమయ్యింది. ప్రభుత్వానికి చెందిని కీలక నేతలు కూడా విజయోత్సవాలపై అత్యుత్సాహం చూపారు. ఎవరి ఒత్తిడైనా కానీ విజయోత్సవాల వేళ చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో ఏకంగా 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఆతర్వాత వివిధ కోణాల్లో విచారణ జరిపారు. పోలీసులను దోషులుగా చూపి ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. క్యాట్‌ను ఆశ్రయించిన ఓ అధికారి రాష్ట్ర ప్రభుత్వ చర్యలనుంచి మినహాయింపు పొందారు. మిగిలిన అధికారులకు ఇటీవల ప్రభుత్వం సస్పెన్షన్ రద్దుచేసింది. స్టేడియం వద్ద ఎంతమంది అభిమానులు చేరారు, విధానసౌధ చెంతకు ఎంతమంది వచ్చారనేది పసిగట్టడంతో ఇంటెలిజెన్స్ విఫలం అయ్యింది. ప్రమాదం జరిగి ఏకంగా ఆసుపత్రులకు తీవ్రంగా గాయపడిన వారు చేరుకున్నా ఉన్నతాధికారులు గుర్తించలేక పోవడమే కాకుండా చివరకు సీఎం, డీసీఎంలకు కొన్ని గంటల తర్వాత సమాచారం తెలుసుకోవడం విడ్డూరం.

మైసూరులో డ్రగ్స్ తయారీ కేంద్రం

రాచనగరిగానూ, పర్యాటక కేంద్రంగానూ గుర్తింపు కలిగిన మైసూరులో ఏకంగా డ్రగ్స్ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నా గుర్తించలేక పోయారు. మహారాష్ట్ర స్పెషల్ పోలీసులు శనివారం దాడి చేశారు. కొంతకాలంగా డ్రగ్స్ తయారు చేసి దేశవిదేశాలకు పంపుతున్నట్లు గుర్తించారు మహారాష్ట్ర పోలీసుల దాడిలో 268.79 కేజీల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో దీని విలువ రూ.381.94 కోట్లుగా అంచనా వేశారు. రెండు ఓవెన్‌లు, 11హీటింగ్ మిషన్‌లు, 86 కేజీల ఐసోప్రొపైల్, 166 కేజీల అసిటోన్, 60 కేజీల క్లోరోఫారం, 254 కేజీల మెంథాశియం సల్ఫేట్, ప్లాస్టిక్ డ్రమ్ములుతో పాటు ఇతరత్రా వస్తువులను గుర్తించారు. స్వాధీనం చేసిన అన్ని వస్తువులను కలిపితే రూ.391 కోట్లుగా ఉంటుందని మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. స్వయంగా సీఎం సిద్దరామయ్య సొంతూరు మైసూరు కావడమే కాకుండా వారంలో కనీసంగా ఒకరోజు అయినా ముఖ్యమంత్రి మైసూరులో ఉంటారు. అటువంటి ప్రాంతంలోనే భద్రత కరువయ్యిందంటే ఇక ముఖ్య అధికారులు, పాలకులకు చుట్టపు చూపుగా ఉండే ఉత్తర కర్ణాటక జిల్లాల పరిస్థితి ఎలా ఉంటుందో అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. మైసూరులో డ్రగ్స్ వాడకం ఏస్థాయికి చేరిందంటే అనుమానం వచ్చిన 100మందిని అదుపులోకి తీసుకుంటే 60మంది పాజిటివ్‌గా తేలింది.



అనుమానిత ఉగ్రవాద మహిళను అరెస్టు చేసిన గుజరాత్ పోలీసులు

రాజధాని బెంగళూరులో ఐదేళ్ళుగా నివసిస్తూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న జార్ఖండ్‌కు చెందిన శమాపర్వీన్ అన్సారీ (30)ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందం దాడిచేసి అరెస్టు చేశారు. ఆమె రెండు ఫేస్‌బుక్ ఖాతాలు, ఒక ఇన్‌స్టాగ్రాం అకౌంట్ ద్వారా ఉగ్రవాద ప్రేరేపిత చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆమెకు 10,000 మంది ఫాలోయర్స్ ఉన్నారు. ఉగ్ర వాదుల ప్రసంగాలను షేర్ చేసి యువతను ప్రభావితం చేసేవారు. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలతో ఆమెకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమె ఆర్‌టీ నగర్‌లో తల్లి, సోదరుడితో పాటు నివసించేవారు. ఆమెను గుజరాత్‌కు తీసుకెళ్ళిన అధికారులు వివిధ కోణాలలో విచారణలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇలా దేశ విద్రోహ చర్యలకు పాల్పడే వారిని స్థానిక పోలీసులు గుర్తించలేక పోవడం విమర్శలకు తావిస్తోంది. పక్క రాష్ట్రాలు పట్టుకునే దాకా మన ఇంటెలిజెన్స్ ఏం చేస్తోందంటూ రాష్ట్ర ప్రజలు భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు మేల్కోవాలని సూచిస్తున్నారు.



అరెస్ట్ అయిన అనుమానిత మహిళ



చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట (ఫైల్)



ఫ్రీడం పార్క్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీఎం, సూర్జేవాలా

చలో ఫ్రీడం పార్క్

- 5న కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన
- ఓటరు జాబితాలో అక్రమాలపై ఆగ్రహం
- హాజరు కానున్న రాహుల్‌గాంధీ, పలువురు నేతలు



బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రీడం పార్కులో ఓటరు జాబితాలో అక్రమాలపై ఆగస్టు 5వ తేదీ మంగళవారం ఆందోళన చేపట్టనున్నట్లు డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. గురువారం ఆందోళనకు సంబంధించి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణదీప్‌సింగ్ సూర్జేవాలాతో కలిసి ఫ్రీడం పార్కును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఓటరు హక్కు ప్రజాస్వామ్య రక్షణ కల్పించే ఆయుధమన్నారు. ఓటరు చౌర్యంపై రాష్ట్రం నుంచే పోరాటం ప్రారంభిస్తామన్నారు. తమ ప్రభుత్వం చేసిన నిబంధనలు, న్యాయాలయ మార్గదర్శకాలకు అనుగుణంగానే నిరసన చేస్తామన్నారు. ఓటరు జాబితాలో అవకతవకలపై ఎన్నికల కమీషన్‌కు వినతి ఇచ్చామని వారు స్వీకరించలేదన్నారు. దీనికి నిరసనగానే పోరాటం చేస్తామన్నారు. గాంధీనగర్‌లో ఏకంగా ఏడువేల మంది ఓటర్లు చేర్చారన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర చేయడం లేదన్నారు. ఫ్రీడం పార్కులో మాత్రమే ఆందోళన చేస్తామన్నారు. ఏ నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలు విడుదల చేసే ప్రక్రియ రాహుల్‌గాంధీ చేస్తారన్నారు.

ఢిల్లీకి వేర్వేరుగా సీఎం, డీసీఎం పయనం 7లో

క్వాంటమ్ ఇండియాతో మరింత ప్రగతి

- బెంగళూరులో క్వాంటమ్ సిటీ స్థాపన
- సదస్సులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ ఇండియా బెంగళూరు ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో కర్ణాటక నాయకత్వం అంతర్జాతీయ స్థాయికి చేరనుందని సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం బెంగళూరులో క్వాంటమ్ ఇండియా బెంగళూరు-2025 సదస్సును లాంచనంగా ప్రారంభించారు. సదస్సుకు హాజరైన నోబుల్ పురస్కార గ్రహీతలతో పాటు శాస్త్రవేత్తలు, టెక్నాలజీ నిపుణులను సాదరంగా స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఐఐఎస్‌సీ క్వాంటమ్ టెక్నాలజీ సహకారంతో జాతీయ క్వాంటమ్ మిషన్ భాగస్వామ్యంతో సదస్సు ఏర్పాటు చేసిందన్నారు. సాంకేతిక రియల్ వరల్డ్ క్వాంటమ్ అప్లికేషన్ విశ్వ కేంద్రంగా తీసుకెళ్ళడం తమ ఆశయమన్నారు. ఐటీ, బీటీ రంగాలతో పాటు పరిశోధనా రంగాలకు రాష్ట్రం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అధ్యక్షత వహించిన సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసరాజు మాట్లాడుతూ బెంగళూరులో క్వాంటమ్ సిటీను స్థాపిస్తామన్నారు. తద్వారా 2035నాటికి కర్ణాటక 20 శతకోటి డాలర్‌ల క్వాంటమ్ ఆర్థిక రాజధాని కానుందన్నారు. బెంగళూరు నగర వ్యాప్తంగా మౌళిక సదుపాయాలు కల్పించదలచామన్నారు. ఇప్పటికే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సస్‌లో క్వాంటమ్ పార్కును ప్రారంభించామన్నారు. ఏడాది ఆఖరుకు క్వాంటమ్ చిప్ ఫ్యాబ్రికేషన్ సామర్థ్యం సాధిస్తామన్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా వివిధ విభాగాలపై చర్చాగోష్ఠులు జరిగాయి. క్వాంటమ్ ప్రాముఖ్యతను పలువురు మేధావువులు వివరించారు. డీసీఎం డీకే శివకుమార్ పలుదేశాల ప్రతినిధుల సమీక్షలో భాగస్వామ్యులయ్యారు. మంత్రులు ఎంబీపాటిల్, ప్రియాంకఖర్గే, కృష్ణబైరేగౌడ, డాక్టర్ సుధాకర్‌లతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీష్ తదితరులు ఉన్నారు.



నిపుణులను సత్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య, మంత్రులు

నగరంలో మళ్లీ టోయింగ్

- 10 వాహనాలు సమకూర్చాలని పాలికెకు పోలీసుల వినతి
- విచ్చలవిడి పార్కింగ్‌పై చర్యలకు సిద్ధం

బెంగళూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరమంటే వెంటనే గుర్తుకొచ్చేది ట్రాఫిక్ జామ్... గార్డెన్‌సిటీ, ఐటీ సిటీకంటే ట్రాఫిక్ అంశంపైనే సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి. నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పలు విధానాలు అమలు చేస్తున్నారు. నగరంలో ఏటా వాహనాల రెట్టింపు సంఖ్యలో పెరుగుతోంది... అదే రీతిన ట్రాఫిక్ కూడా పెరుగుతోంది. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే గుర్తించడానికి వీలుగా ఏఐ సాంకేతిక కెమెరాలను వినియోగిస్తున్నారు. నగరంలో వాహనాల సంఖ్య ఎలా పెరుగుతోందో వాటిని పార్కింగ్ చేయడం కూడా ఒక సవాల్‌గా ఉంటోంది. చాలావరకు కార్లు ఇతర వాహనాలకు అపార్ట్‌మెంట్‌లు మినహాయిస్తే సాధారణ ఇళ్ల వద్ద పార్కింగ్ సదుపాయం చాలా తక్కువ. దీంతో ఇంటి ముందు ఫుట్‌పాత్ పై పార్కింగ్ చేస్తుంటారు.

- నగరంలోని రద్దీ ప్రాంతాలైన ఎంజీ రోడ్డు, కేఆర్ మార్కెట్, హోసూరు రోడ్డు, మైసూరు రోడ్డుతోపాటు వాణిజ్య ప్రదేశాలైన ఎస్‌పీ రోడ్డు, అవెన్యూరోడ్డు, శివాజినగర్, కమర్షియల్ స్ట్రీట్, చర్చ్‌స్ట్రీట్ వంటి ప్రాంతాలలో పార్కింగ్ చేయడం సవాల్‌గా మారింది. వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేయరాదని టోయింగ్ విధానం అమలులోకి తెచ్చారు. సుమారు రెండేళ్లక్రితం టోయింగ్ వేళ దురుసుగా ప్రవర్తించిన అంశం వైరల్ కావడంతో టోయింగ్ విధానాన్ని రద్దు చేశారు.
- అయితే నగర ప్రజల అనుకూల, వ్యతిరేక చర్చల నడుమ రాజధానిలో టోయింగ్ విధానం మళ్లీ జారీ చేసేందుకు ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం కసరత్తు జరుపుతోంది. టోయింగ్ వాహనాలు సమకూర్చాలని బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ను పోలీసుశాఖ కోరింది. బీబీఎంపీ పరిధిలో కొవిడ్, లాక్‌డౌన్ అనంతరం వాహనాల సంఖ్య పెరిగింది. ఏడాది అవధిలో సాధారణ వాహనాలతోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అమాంతంగా పెరిగాయి.

నగరంలో ప్రతిరోజూ సరాసరిన 2,300 కొత్త వాహనాలు రిజిస్టర్ అయి రోడ్డుపైకి వస్తున్నాయి. ఇలా ప్రస్తుతం వాహనాల సంఖ్య 1.25 కోట్లు మార్కు దాటేసింది. నగరంలో 2003 సంవత్సరంలో ప్రతి వెయ్యిమందికి 400 వాహనాలు ఉండేవి. ప్రస్తుతం వెయ్యిమందికి సగటున 848 వాహనాలు ఉన్నట్టు అంచనాగా ఉంది. అయితే ఇందుకు తగినంత రీతిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ట్రాఫిక్ జామ్, పార్కింగ్ సమస్యలు నెలకొన్నాయి.

ఉప విభాగానికో వాహనం

పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు నిర్దీత స్థలాల్లో మాత్రమే పార్కింగ్ చేసేలా పర్యవేక్షించడం పోలీసులకు తలనొప్పిగా ఉంది. ప్రత్యేకించి ద్విచక్రవాహనాలు ఇష్టం వచ్చినట్టు పార్కింగ్ చేస్తుండడం పలు చోట్ల ట్రాఫిక్‌కు సమస్యగా మారింది. పోలీసుశాఖ సమాచారం ప్రకారం పార్కింగ్ నియమాలు ఉల్లంఘించిన కేసులు జనవరి నుంచి జూన్ వరకు సుమారు 3.50 లక్షల కేసులు నమోదయ్యాయి. రోజుకు సగటున 1,900 కేసులు నమోదైనట్టు సమాచారం. ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు పార్కింగ్ నియమాల ఉల్లంఘనలు తగ్గించడానికి బీబీఎంపీతో కలసి టోయింగ్ వ్యవస్థను మళ్ళీ జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ అంశంపై హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ ఇప్పటికే సూచనప్రాయంగా ప్రకటన చేశారు. టోయింగ్ వాహనాలకు టెండరు పిలవాలని పోలీసుశాఖ ప్రస్తావనలు పంపిందన్నారు. నగరంలో ప్రస్తుతం 49 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. 10 ట్రాఫిక్ ఉపవిభాగాలకు తలా ఒక టోయింగ్ వాహనం కేటాయించేలా ఉద్దేశించబడిందన్నారు.

టోయింగ్ ఫీజు విధించరు...

గతంలో వాహనాలను ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేస్తే జరిమానాతోపాటు టోయింగ్ ఫీజుగా రూ.800 విధించేవారు. అదనపు పన్ను విధించడానికి కారణం టోయింగ్ వాహన సిబ్బంది, వాహన యజమానుల మధ్య రోడ్లపైనే వాగ్వాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రతిపాదించిన అంశంలో టోయింగ్ పన్ను ఉండరాదని తీర్మానించారు. వాహనాన్ని నిర్దిష్ట స్థలంలో కాకుండా మరోచోట వాహనం పార్కింగ్ చేసినందుకు సదరు వాహన యజమాని జరిమానా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అదనపు టోయింగ్ చార్జ్ కట్టాల్సిన అవసరం లేదు. టోయింగ్ చేసినా వాహన యజమాని ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా తీర్మానించినట్లు పోలీసుశాఖ ఉన్నతాధికారుల ద్వారా తెలుస్తోంది. వాహనాల కొరత కారణంగా గతంలో టోయింగ్‌కు బాడుగ వాహనాలు ఉపయోగించేవారు. ప్రస్తుత పోలీసుశాఖ వద్ద 3 టోయింగ్ వాహనాలు ఉన్నాయి. వీటికి తోడు పాలికె నుంచి వాహనాలు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. పోలీసు, హోం గార్డు సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించారు. ప్రజల ఫిర్యాదు మేరకు టోయింగ్ వ్యవస్థను మళ్ళీ అమలు చేయాలని నిర్ణయించారు.

నెలాఖరుకు టోయింగ్

ప్రభుత్వ సూచన మేరకు నగరంలో ఆగస్టు నెలాఖరుకు టోయింగ్ వ్యవస్థ మళ్ళీ అమలు చేయడానికి కార్యాచరణ చేస్తున్నారని ట్రాఫిక్ విభాగం జాయింట్ పోలీస్ కమిషనర్ కార్తికెరెడ్డి తెలిపారు. పార్కింగ్ నియమాలు ఉల్లంఘించిన వాహనాలను టోయింగ్ ద్వారా తరలించేందుకు పది కొత్త వాహనాలను సమకూర్చాలని బీబీఎంపీని కోరినట్లు తెలిపారు.

2022లో ఆపేశారు..

బీజేపీ పాలనలో టోయింగ్ అమలులో ఉన్నప్పుడు పోలీసుల వేధింపుల గురించి ఫిర్యాదులు వచ్చాయి. ప్రత్యేకించి ఈ-కామర్స్ ద్వారా వస్తువులను డెలివరీ చేసే బాయ్ తన ద్విచక్రవాహనాన్ని విడిపించుకోవడానికి టోయింగ్ వాహనం వెనుక పరుగెత్తిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఈ అంశంపై ట్రాఫిక్ పోలీసులు, టోయింగ్ సిబ్బంది తీరుపట్ల సోషల్‌మీడియా వేదికగా ప్రజలు తీవ్ర విమర్శలు, ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం టోయింగ్ వ్యవస్థను ఆపేసింది.



వాహనాలను తరలిస్తున్న పోలీసులు (ఫైల్)



సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక అధికారుల బృందం

సంపంగిరామనగర్‌లో కుప్పకూలిన భవనం 7
- నీటి సంపు కోసం తవ్వుతుండగా ప్రమాదం

పెళ్లయినా ప్రేమించాలని వేధింపులు
- ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరింపులు
- పోలీసులు హెచ్చరించినా తీరు మార్చుకోని ప్రబుద్ధుడు
- తాళలేక యువతి ఆత్మహత్య



భావన(ఫైల్)

భర్తను అప్పుల వారు వేధిస్తున్నారని నదిలో దూకిన భార్య
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



బళ్లారి కమ్మ భవనంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్ తదితరులు

ఎన్టీఆర్ జనం గుండెల్లో ఉంటారు 8
- నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్
- బళ్లారిలో కమ్మ మహాజన సంఘం సమావేశం
- అన్న క్యాంటీన్ సేవలకు అభినందనలు

క్రైం కార్నర్

ఆటో కింద పడి విద్యార్థిని మృతి


తనూజ (ఫైల్)

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం.. ఓ విద్యార్థినిని బలిగొంది. మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం ఆటో కింద పడి తనూజ(9) మరణించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన వెంకటనాయుడు, నాగసునీత దపంతులు మూడేళ్ల క్రితం కల్లూరు కొండకింద ఇందిరమ్మ కాలనీకి వలస వచ్చారు. ఇక్కడే ఉంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. వారికి కుమారుడు, కుమార్తె తనుజ సంతానం. తనూజ కల్లూరు ఆర్ఎస్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండేది. గురువారం పాఠశాలకెళ్లి సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరింది. ఇంటి సమీపంలోకి రాగానే విద్యార్థిని ప్రమాదవశాత్తు జారి కిందపడింది. డ్రైవర్ గమనించకపోవడంతో చిన్నారి కాళ్లు, తలపై ఆటో వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని ఆదే ఆటోలో పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమార్తె మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దకర్మకు వచ్చి ప్రమాదంలో..

చెన్నేకొత్తపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బంధువుల పెద్దకర్మకు వచ్చిన ఓ వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రంపల్లి సమీపంలో గురువారం జరిగింది. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపిన మేరకు....బుక్కరాయసముద్రం మండలం పసలూరు కొత్తపల్లికి చెందిన నాగలింగారెడ్డి(57) తన బంధువుల పెద్దకర్మకు ఎర్రంపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో కాలకృత్యాల కోసం వెళ్లి తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు. మృతుడికి భార్య సుధారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం దేవరపల్లివద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. గురువారం ఉదయం లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ యర్రిస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు. మృతుడి వయసు దాదాపు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గొర్రెల కాపరి..

ముదిగుబ్బ, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి సాకే వెంకటేష్(42) మృతిచెందాడు. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాకే వెంకటేష్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని పొలంలో గొర్రెలు తోలుకున్నాడు. అక్కడే విద్యుత్ స్తంభం పక్కన కిందపడి ఉన్న విద్యుత్ వైరును పక్కకు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ అన్న వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సిద్ధేశ్వర ఆలయంలో చోరీ

బత్తలపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి. చెర్లోపల్లి సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆలయంలోని పార్వతీదేవి విగ్రహానికి శ్రావణ మాసం సందర్భంగా రెండు తులాల బంగారం చైను, రెండు తులాల నల్లపూసల దండ అలంకరించారు. రోజు వారిలాగే పూజారి పవన్‌కుమార్ బుధవారం పూజలు నిర్వహించి గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం గుడికి వెళ్లి చూడగా పార్వతీదేవి విగ్రహానికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలు కన్పించలేదు. విషయాన్ని గ్రామస్థులకు వివరించి, వారితో కలసి బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన నమోదు చేస్తున్న పౌరసత్వ చట్ట సవరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమవుతుందని పేర్కొన్నారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు దీన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. బిహార్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఇలాంటివి అమలు చేయడం తగదన్నారు. ఈ ఎస్ఐఆర్‌ను బిహార్‌కు మాత్రమే కాక దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం దారుణమన్నారు. నాలుగేళ్ల కిందట దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని దుయ్యబట్టారు. విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ బిహార్‌లో దాదాపు 30 లక్షల మంది వలస కార్మికులను ఓటరు జాబితాను తొలగించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు సతీష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, వలి, మసూద్, నగర కమిటీ సభ్యులు రాజు, లక్ష్మినారాయణ, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయించండి: జేడీఏ

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'ఏం మీకు చెప్పేది అర్థం కావడం లేదా..? అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులతో ఇంకా ఈకేవైసీ ఎందుకు చేయించలేదు. పెండింగ్‌లోని ఎన్‌పీసీఐ లింక్ చేయించడంపై నిర్లక్ష్యం ఎందుకు' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పలు మండలాల ఏఓలపై మండిపడ్డారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి టెక్నికల్ ఏఓలు శశికళ, రాకేష్, వంశీకృష్ణలతో కలిసి గురువారం ఆమె మండలాల ఏఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు సంబంధించి పెండింగ్ లోని ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్‌పై పలు మండలాల ఏఓలను ఆమె ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీతోపాటు ఎన్‌పీసీఐ లింక్ వెంటనే పూర్తి చేయించేలా చొరవ చూపాలన్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము అర్హులైన రైతులందరికీ జమ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లోని ఈకేవైసీ పూర్తి చేయడంతోపాటు సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లోని 7802 మంది రైతుల ఎన్‌పీసీఐ లింక్‌ను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు.

సర్వజన ఆశలు..!

పెద్దాస్పత్రిలో నెలకు సగటున 65వేల మందికి సేవలు

- అయినా.. 560 పడకలకే పరిమితం
- సూపర్ స్పెషాలిటీ పరిస్థితీ అంతే..
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు విజయవాడకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు.. సర్వజనులకు వైద్యసేవల నిలయాలుగా మారాయి. నెలకు సగటున 65వేలమందికి ఓపీ సేవలందిస్తోంది. 6500మంది అడ్మిషన్ అవుతుంటే. 5వేలమంది డిశ్చార్జ్ అవుతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల విభాగంలోనూ ఆదేస్థాయిలో గణాంకాలు నమోదు అవుతున్నాయి. ఇంత స్థాయిలో సేవలు అందిస్తూనే నేటికీ 560 పడకల ఆస్పత్రిగానే మిగిలిపోయింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కష్టాలు మరోలా ఉన్నాయి. సూది, మందు కావాలన్నా సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలి. పక్కనే సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉన్నా.. తీసుకోవడానికి వీల్లేదు. ఎలక్ట్రికల్, ఏసీ, ఐసీసీయూ, లిఫ్ట్ తదితర సేవల్లో తరచూ అంతరాయం తప్పడంలేదు. ఇక మెడికల్ కాలేజీలో పీజీ, యూజీ విద్యార్థులకు అవసరమైన కంప్యూటరైజ్డ్ సౌకర్యాలు కరువయ్యాయి. లైబ్రరీ, గ్యాలరీ, సెమినార్ హాళ్లు తదితర సౌకర్యాల్లేక పాతపద్ధతిలోనే చదవాల్సి వస్తోందని విద్యార్థివర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నూతన భవన నిర్మాణాలు, సౌకర్యాల కల్పనపై ఎంత చెప్పినా తక్కువేనని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా శుక్రవారం వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) అనంతపురం జిల్లాకు సంబంధించి సమీక్షించనున్నారు. దీంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ఆత్మారామ్ గురువారం బయలుదేరి వెళ్లారు. ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, మెరుగైన వైద్యసేవలు అందించేలా డీఎంఈ నిర్ణయం తీసుకునేరా అంటూ రోగులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.


నిర్మాణదశలో సర్జికల్ బ్లాక్ భవనం

560 పడకలకే పరిమితం

జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రిగా 2000 సంవత్సరంలో 560 పడకల ప్రభుత్వ సర్వజన వైద్యశాల అప్‌గ్రేడ్ అయింది. ఆ మేరకే డాక్టర్లు ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను మంజూరు చేశారు. 560 పడకల ప్రకారమే ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, క్రిటికల్ కేర్ యూనిట్లు, క్యాజువాలిటీ తదితర విభాగాలను ఏర్పాటుచేశారు. 25ఏళ్లలో ఓపీ, ఐపీ, ఓటీ సేవల సంఖ్య పెరిగిపోయింది. ప్రస్తుతం నెలకు సగటును 65వేలమంది ఓపీ సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన 1500 పడకలు అవసరం. పోస్టులను మూడింతలు పెంచాలి. సరాసరి 3000 చొప్పున మేజర్, మైనర్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆ మేరకు ఆపరేషన్ థియేటర్లు, సదుపాయలు, టెక్నీషియన్లు తదితరాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆస్పత్రుల వర్గాలు వివరిస్తున్నాయి. 700 వరకు ప్రసవాలు జరుగుతున్నా.. సౌకర్యాల లేమితో ఇబ్బందులు తప్పట్లేదు.


సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐసీయూ వార్డులో పనిచేయని ఏసీ

సిబ్బంది కొరత

సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 40శాతం మాత్రమే రెగ్యులర్ ఇబ్బంది ఉన్నారు. 30శాతం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్నారు. 30శాతం కొరత ఉంది. దీని ప్రభావం వైద్యవిద్య, ఓపీ, ఐపీ, క్యాజువాలిటీ సేవలపై పడుతోంది. సూపర్ స్పెషాలిటీలోని తొమ్మిది విభాగాలకుగాను ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లకుగాను నలుగురు, 18మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకుగాను 9మంది ఉన్నారు. మొత్తం 36 పోస్టులకుగాను 21 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనే ఖాళీగున్నాయి. సర్వజన వైద్యశాల, నాన్ క్లినికల్ విభాగాల్లోనూ అదే సమస్య వెంటాడుతోంది.

నిర్మాణాలకు నిధుల లేమి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ, ఐపీ సంఖ్య ప్రతి సంవత్సరం రెట్టింపు అవుతోంది. ఈ క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంచేందుకు 2014-19లో అప్పటి పాలనాధికార వర్గం, ప్రభుత్వం శ్రమించాయాయి. ఇక్కడి పరిస్థితులను కళ్లకు కట్టేలా లేఖలో రూపంలో కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ స్పందించి ప్రత్యేక సహాయం కింద రూ.300కోట్లను ఇస్తామని హామినిచ్చింది. దీంతో నాలుగు బ్లాక్‌లతో మూడు అంతస్థుల సర్జికల్ బ్లాక్, ఆరు అంతసులతో పీజీ హాస్టల్ భవనాలు, తల్లీబిడ్డ ఆస్పత్రి(ఎంసీహెచ్)ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. తెలుగు తల్లి విగ్రహం వద్దనున్న ఇరిగేషన్ కార్యాలయంలో సర్జికల్ బ్లాక్, వైద్య కళాశాలలో పీజీ హాస్టళ్ల పనులు మొదలుపెట్టారు. ఆర్ అండ్‌బీ కార్యాలయంలో తలపెట్టిన ఎంసీహెచ్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల లేమి సమస్యగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నిర్మాణపనులు చేపట్టారు. నిధులు వస్తేనే పనులుపూర్తవుతాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ఎంపీ నిధులతో..

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ తన ఎంపి ల్యాండ్స్ కింద నిధులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. రూ.40లక్షలతో మేల్ బ్లాక్, రూ.35లక్షలతో ఫిమేల్ బ్లాక్ పేర్లతో విశ్రాంతి ధామాల నిర్మాణపనులు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీ)ను నిర్మిస్తున్నారు. కాలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ(సీడీఎస్) నిధులతో రూ.16లక్షల అంచనా వ్యయంతో క్యాంటీన్ మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు.

ప్రతి అంశం క్షుణ్ణంగా...



టీచింగ్, పీజీ, ల్యాబ్స్ పారామెడికల్ ఇలా ప్రతి అంశంపై క్షుణ్ణంగా నివేదికలు రూపొందిస్తున్నాం. కళాశాల, సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మూడింటి అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విభాగాల వారీగా వివరాలను, అప్‌గ్రేడ్ అంశాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తున్నాం. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు.

\- షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

అభివృద్ధివైపు అడుగులు



ఆస్పత్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. నాణ్యమైన వైద్యసేలకు అవసరమైన సౌకర్యాలు, వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్యాడర్ల వారీగా సిబ్బంది వివరాలు తెలియజేస్తున్నాం. 560 పడకల నుంచి వెయ్యి పడకలకు పెంచేలా దృష్టి సారించాం.

\- ప్రొఫెసర్ ఆత్మారామ్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు


ఎంఎం హళ్లి గ్రామం వద్ద పీఏబీఆర్‌లోకి వెళ్తున్న కృష్ణాజలాలు

కూడేరు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. జీడిపల్లి రిజర్వాయర్ నిండిపోవడంతో గురువారం 2 వేల క్యూసెకుల నీరు పీఏబీఆర్‌లోకి వదిలారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో నీటి మట్టం 426.900 అడుగుల వద్ద 1.875 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో ఎంఎంహళ్లి గ్రామ సమీపాన వంకలో నీటి ఉధృతి పెరిగింది. పీఏబీఆర్‌లోకి నీరు చేరుతుండటంతో కుడికాలువ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీటెక్ ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు గురువారం ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరిధిలో జూన్, జూలై నెలలలో నిర్వహించిన పరీక్షలు బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్20) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండో సెమిస్టర్(ఆర్21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ మొదటి సెమిస్టర్(ఆర్21)సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ, నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎ.పి.శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు కీలకం: వైవీ

శింగనమల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు కీలకమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి గత ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకే జమ చేసుకుంది తప్ప.. అభివృద్ధికి నయాపైసా కూడా ఇవ్వలేదన్నారు. కూటమి పాలనలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు.

తల్లికి వందనం నగదు అందజేత


సిద్దక్కకు నగదు అందజేస్తున్న దృశ్యం

పరిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సిద్దక్క కుమారుడు నవనీత్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తల్లికి వందనం నగదు విద్యార్థి తల్లిఖాతాలో కాకుండా గొర్రెపల్లి గ్రామానికి చెందిన ఎస్. నవదీప్ తండ్రి నాగరాజు ఖాతాలో జమకావడంతో ఆంధ్రజ్యోతిలో ఇతరుల ఖాతాలోకి తల్లికి వందనం అనే కథనం వెలువడింది. ఇందుకు స్పందించిన హెచ్ఎం కృపాసత్యరాజ్ పరిశీలించి నాగరాజ్‌ను ఫోన్‌లో సంప్రదించి వారికి తిరిగి నగదు అందజేయాలని కోరగా వారు గురువారం సిద్దక్కకు ఆ నగదును అందజేశారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, నాగభూషణం, సచివాలయ సిబ్బంది వీరశంకర్, అచ్యుత్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసమే టీడీపీ ఆవిర్భావం

- నందమూరి రామకృష్ణ


విలేకరులతో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ

బొమ్మనహాళ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ పేర్కొన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం మండల కేంద్రానికి వచ్చిన అయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువాడి పౌరుషాన్ని ఢిల్లీకి పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని కీర్తించారు. తెలుగువాడి సత్తాను చాటిచెప్పడానికి పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో కొనసాగుతుందని అన్నారు. అంతకుముందు ఆయన్ను కాలవ భరత్ శాలువతో సత్కరించి స్వాగతించారు. ఆయన వెంట టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీటీ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, పయ్యావుల అనిల్ తదితరులు ఉన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేల ధరతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరిగా రూ.10,100 పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1336 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు

బెళుగుప్ప, జూలై 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు వెళ్తున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 2100 క్యూసెక్కులు వస్తోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.729 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

ముగిసిన కుట్టు శిక్షణ

పరిగి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీ మహిళల కోసం మూడు నెలల క్రితం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. పెద్దరెడ్డిపల్లి గ్రామంలోని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి మంత్రి సవిత ఆదేశాల మేరకు 140మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించారు. శిక్షణను పూర్తి చేసిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామంలో స్థానిక మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఏర్పాటు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, సర్పంచ్ బాలాజీ, శాసనకోట వెంకటేశు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

మడకశిర టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శైలజకుమారి సూచించారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు రాగి పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాగి పంట విస్తీర్ణాన్ని పెంచాలని, విత్తనశుద్ధికి జీవ ఎరువులు అయినా రైజోబియం అసిటోబాక్టర్, పీఎస్‌బీ వంటి ఎరువులను వాడాలన్నారు. అనంతరం వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఏఓ తిమ్మప్ప, అధికారలు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ

రొళ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎరువులు, విత్తనాల వాడకంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీ శైలజ కుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంటలు విత్తనాల నాణ్యతను ప్రయోగశాలలో పరీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటబ్రహ్మం, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, పాండురంగప్ప, ఈరన్న, కిష్టప్ప, రామక్రిష్ణ, నాగేంద్ర, గోవిందప్ప పాల్గొన్నారు.

కొడుకుతో కలిసి భర్త హత్య

- ఆస్తి దక్కకుండా పోతుందనే దారుణం
- కారుతో ఢీకొట్టించి.. ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ
- నిందితుల అరెస్టు


గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆస్తి ఎక్కడ దక్కకుండా పోతుందోనని భర్తనే హత్య చేయించింది ఓ భార్య. కుమారుడితో కలిసి పథకం పన్ని కారుతో ఢీకొట్టించి, ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా తేలడంతో నిందితులను అరెస్టు చేశారు. మండలంలోని జంబులదిన్నె గ్రామానికి చెందిన కోయిటాకు నల్లప్ప హత్య కేసులో అతడి భార్య లక్ష్మి, కుమారుడు ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపాడి శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. జంబులదిన్నె గ్రామానికి చెందిన నల్లప్ప, లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో తెలంగాణ రాష్ట్రం తాండూరు మండలం మల్రెడ్డిపల్లికి వలస వెళ్లినపుడు నల్లప్పకు ఆ ఊరికి చెందిన నవీనతో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై నల్లప్పతో భార్య గొడవ పడడంతో ఐదేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. అయినా నల్లప్ప.. నవీనతో సంబంధం కొనసాగిస్తుండడంతో భార్య మళ్లీ గొడవపడింది. నల్లప్ప ప్రవర్తనలో మార్పు రాకపోగా నవీనతో సంబంధాన్ని వదులుకోననీ, భార్యకు విడాకులు ఇస్తానని తెగేసి చెప్పాడు. అదే జరిగితే ఆస్తి తన కుమారుడికి దక్కకుండా పోతుందేమోనని లక్ష్మి భావించింది. భర్తను హత్య చేయాలని భావించింది. కుమారుడు బోయ ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపాడి శ్రీకాంత్‌తో కలిసి పథకం పన్నారు. అందులో భాగంగా గత నెల 23న నల్లప్ప జంబులదిన్నె సమీపంలోని చీనీ తోటకు వెళ్లి ద్విచక్రవాహనంపై గార్లదిన్నె వైపు వస్తుండగా శ్రీకాంత్ అద్దెకు తెచ్చిన కారుతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నల్లప్ప అక్కడికక్కడే మరణించాడు. రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని, లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై నల్లప్ప బంధువులు అనుమానాలు వ్యక్తం చేయడం, ఢీకొట్టి వెళ్లిపోయిన దొరకడంతో పోలీసులు హత్యగా నిర్ధారించారు. ఆ మేరకు లక్ష్మి, ఆశ్రయ్, కట్లపాడి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. వారిని గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా, సిబ్బంది గురుమూర్తి, అంజినేరెడ్డి, కృష్ణ, రామాంజి, దివాకర్, నగేష్, నరేష్, వెంకటేష్, చాగంటి వెంకటేష్, తిరుమలేస్‌నాయుడు, రంగారెడ్డి, జిలాన్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్‌...

విద్వాన్‌'టైగర్‌' వరదాచారి (జయంతి)



కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు, విద్వాన్‌ 'టైగర్‌' వరదాచారి 1876 ఆగస్టు 1న తమిళనాడు రాష్ట్రం కొలత్తూరు ప్రాంతంలో జన్మించారు. పట్నం సుబ్రమణియ అయ్యర్‌ వద్ద 14వ యేటనుంచి సంగీతంలో తర్ఫీదు పొంది క్రమేపీ కర్ణాటక సంగీత గాత్రంలో రాణించారు. మంచి వాగ్గేయకారుడిగా గుర్తింపు పొందారు. సంగీత ప్రతిభను గుర్తించిన మైసూరు మహారాజు కృష్ణరాజ ఒడయార్‌ ఆయనకు 'టైగర్‌' బిరుదును, తోడాను ప్రదానం చేశారు. వేగవంతమైన సంగతులు పాడడం ఆయన ప్రత్యేకత. మద్రాస్‌ మ్యూజిక్‌ అకాడమీ ఆధ్వర్యంలోని 'టీచర్స్‌ కాలేజ్‌ ఆఫ్‌ మ్యూజిక్‌'కు ప్రిన్సిపాల్‌గాను, అన్నామలై విశ్వవిద్యాలయం సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గాను వ్యవహరించారు. 'సంగీత కళానిధి' పురస్కారం అందుకున్నారు. 1950 జనవరి 31న కన్నుమూశారు.

దేవరకొండ బాలగంగాధర తిలక్‌ (జయంతి)



ఆధునిక తెలుగు కవి దేవరకొండ బాలగంగాధర తిలక్‌ 1921 ఆగస్టు 1న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకా మండపాక గ్రామంలో జన్మించారు. భావుకత, అభ్యుదయం ఆయన కవితా లక్షణాలు. వచన కవితా ప్రక్రియను తన అసమాన ప్రతిభాసంపదతో ఉన్నత శిఖరాలకు చేర్చారు. తెలుగు, ఆంగ్లభాషలలో చక్కని పాండిత్యం ఉంది. 1966 జూలై 1న మరణించారు. కుందుర్తి ఆంజనేయులు పీఠికతో 1968లో ముద్రితమైన ఆయన కవితల సంపుటి 'అమృతం కురిసిన రాత్రి'కి 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

మీనా కుమారి (జయంతి)



ట్రాజెడీ క్వీన్‌గా గుర్తింపు పొందిన మీనా కుమారి 1933 ఆగస్టు 1న ముంబై లోని దాదర్‌ ప్రాంతంలో జన్మించారు. ప్రముఖ భారతీయ నటి, గాయని, కవయిత్రి. అసలు పేరు మహ్జబీన్‌ బనో. 'నాజ్‌' పేరిట రచనలు చేశారు. బాలీవుడ్‌లో అత్యంత గొప్ప నటీమణిగా పేరొందారు. చిన్నతనం నుంచి చివరివరకు 30ఏళ్ల కెరీర్‌లో దాదాపు 92 సినిమాల్లో నటించారు. పలు సినిమాలు క్లాజిక్‌లుగా నిలవడం విశేషం. పాకీజా, సాహిబ్‌ బీబీ ఔర్‌ గులాం, మేరే అప్నే, ఆర్తీ, బైజు బవారా, పరిణీతా, దిల్‌ అప్నా ఔర్‌ ప్రీత్‌ పరాయీ, ఫుట్‌పాత్‌ తదితర సినిమాలు ఎంతో పేరొందాయి. ఉత్తమనటిగా పలు ఫిల్మ్‌ఫేర్‌ పురస్కారాలు అందుకున్నారు. 1972 మార్చి 31న కన్నుమూశారు.

పెరిగిన మృతశిశువుల జననం

● ఐదు జిల్లాల్లోనే ఎక్కువ ● గ్రామీణ ప్రాంతాల్లో అధికం ● అవగాహన కల్పించలేకపోతున్న ఆరోగ్యశాఖ



బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): దంపతులు ఎవరైనా చక్కటి సంతానం కోసం కలలుగంటారు. ఇటీవలికాలంలో స్త్రీ పురుషులలో పలు కారణాలతో సంతానలేమి సమస్య నెలకొంటోంది. ఈ కారణంగానే పలుచోట్ల ఐవీఎఫ్‌ సెంటర్‌లు తలెత్తుతున్నాయి. అయినా పుట్టే పిల్లలు పలు అనారోగ్య ఇతర సమస్యలతోనే కాకుండా ఒక్కోసారి మృతశిశువులు జన్మిస్తున్నారు. అయితే రాష్ట్రంలో మృత శిశువుల జననం అధికం కావడం కలవరపెడుతోంది. ప్రత్యేకించి 12 జిల్లాల్లో పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. హావేరి, ధారవాడ, చామరాజనగర జిల్లాల్లో ఈ ప్రమాణం అధికంగా ఉంది. నగర ప్రదేశాలలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రసవం వేళ తలెత్తే సమస్యలతో ఒక్కోసారి తల్లీబిడ్డలు మృతి చెందుతారు అయితే వీటికంటే మృతశిశువుల జననం అధికం కావడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఈ అంశంపై ఆరోగ్యశాఖ తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

● 2024లో రాష్ట్రంలో 9,91,879 మంది శిశువులు జన్మించారు. వీరిలో 3,244 మంది నిర్జీవ శిశువులు జన్మించడం కలవరపెడుతోంది. హావేరి, ధారవాడ, చామరాజనగర, గదగ, మైసూరు జిల్లాలలో ఈ ప్రమాణం అధికంగా ఉంది. వెయ్యిమంది శిశువుల జననంపైకి 3.41 మంది మృత శిశువులు జన్మిస్తున్నారు. అయితే కొన్ని జిల్లాల్లో ఈ ప్రమాణం 9.30శాతంగా ఉండడం ఆరోగ్యశాఖకు సవాల్‌గా మారింది.

2024 ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అత్యధికంగా హావేరి జిల్లాలో మృత శిశువుల జననం అధికంగా ఉంది. తర్వాతిస్థానంలో ధారవాడ, చామరాజనగర, గదగ్‌, మైసూరు జిల్లాలు ఉన్నాయి. గర్భావస్థలో పిండానికి తగిన పోషకవిలువల అందేలా గర్భిణీ వ్యవహరించాల్సి ఉందని ఆరోగ్యశాఖ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వానికి సిగ్గుచేటు

తల్లీబిడ్డల మరణాలకంటే మృతి చెందిన శిశువులు జననం అధికం కావడం ప్రభుత్వానికి సిగ్గుచేటుగా మారింది. 2020లో తక్కువ సంఖ్యలో ఉన్న మైసూరు, చిక్కమగళూరు, బెంగళూరు గ్రామీణ, బళ్ళారి, దావణగెరె జిల్లాల్లో రెండు మూడేళ్లలో నిర్జీవ శిశువుల జననం అధికమైంది.

2020లో 9,88,143 మంది జన్మించగా వీరిలో 3,326మంది మృత శిశువులు ఉన్నారు. 221 మంది (2.11శాతం) గ్రామీణ, ,3105 మంది (5.24శాతం) నగర ప్రాంతాలలో ఉన్నారు. అదే 2024లో 9,91,879మంది జన్మించగా 3,244మంది మృత శిశువులు ఉన్నారు. వీరిలో 99మంది (0.19శాతం) గ్రామీణ ప్రాంతాలలోనూ, 3,145మంది (7.18శాతం) నగర ప్రాంతాలలో ఉన్నారు. పదేళ్లక్రితం అంటే 2015లో గ్రామీణ ప్రాంతాలలో 5.36శాతంగాను, నగరాలలో 4.07శాతం మృతశిశువుల ప్రమాణం ఉండేది.

కొన్ని జిల్లాలు ఆదర్శం

మృత శిశువులు జననం లేని జిల్లాలు కొన్ని ఉన్నాయి. ఇలాంటివి ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. హాసన్‌, కొడగు, యాదగిరి జిల్లాలు మాదిరిగా నిలిచాయి. 2023లో యాదగిరిలో ఒక మృత శిశువు జననం కూడా చోటు చేసుకోలేదు. బెంగళూరు నగర, కొప్పళ, రామనగర జిల్లాల్లో 2శాతం, మండ్య, బెళగావి,రాయచూరు, బీదర్‌, కలబురగి, కోలారు, తుమకూరు జిల్లాల్లో 3శాతంగా నమోదైంది.

కారణాలు ఎన్నెన్నో

మృత శిశువులు జన్మించడానికి కారణాలు ఎన్నెన్నో ఉన్నాయి. 2024లో 3,244 మంది మృతశిశువుల జననాలపైకి 239 కేసులలో పిండం ఎదుగుదల నిర్ణీత స్థాయిలో లేకపోవడమేనని తెలుస్తోంది. 368కేసులలో ప్రసవం వేళ ఊపిరాడకపోవడం, 518 కేసులలో బర్త్‌ ట్రామా సమస్యలు, 13 కేసులలో మెడికల్‌ సమస్యలు, 19 కేసులలో గర్భస్రావం, 12కేసులలో ప్రమాదాలు, జ్వరం తదితర కారణాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

ఇంకా తల్లికి మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్‌, బొజ్జ, కవలలు అంతకంటే ఎక్కువ శిశువుల గర్భధారణ, గత ప్రసవంలో నిర్జీవ శిశువుకు జననం, 9నెలలకంటే ముందుగా ప్రసవం కావడం, తల్లికి ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు, ఉత్ప్రేరకాలైన ఔషధాల వాడకం వంటివి కారణాలుగా ఉన్నాయని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గర్భిణులకు సలహాలు

గర్భం దాల్చినప్పుడు పిండానికి తగిన పోషణ అందేలా ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన బరువు పెరగాలి, ఒత్తిడికి లోను కారాదు, గర్భస్థ శిశువు కదలికలలో చాలా తేడా అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు పాటించాలి. ఇష్టం వచ్చినట్టు నిద్రించరాదు.

విగ్రహావిష్కరణకు ఏపీ మంత్రి సత్యకుమార్‌కు ఆహ్వానం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధులు ఇడమకంటి బ్రహ్మారెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొనాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ను బెంగళూరులో స్వాగతించారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు గంగరాజులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా పూర్వపు నెల్లూరు జిల్లా బోర్డు సభ్యుడిగాను పనిచేసిన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఇదే సందర్భంలోనే చిత్తూరు జిల్లా తిరుమలరాజపురం(పాల్లెం)లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాలకు తగిన చర్యలు తీసుకోవాలని వివరించిన మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గంగరాజు తెలిపారు. మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ను తెలుగు విజ్ఞాన సమితి సభ్యులు ప్రత్యేకంగా సత్కరించారు.



మంత్రిని సత్కరిస్తున్న తెలుగు విజ్ఞాన సమితి సభ్యులు

సమాచార హక్కును సద్వినియోగం చేసుకుందాం

● జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి శంకర్‌నాయక్‌

హోస్పేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సౌకర్యాలు, ప్రజా సేవలను సక్రమంగా పొందేందుకు సమాచారం హక్కును సక్రమంగా ఉపయోగించుకోవాలని ఆరోగ్య,కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్‌ ఎల్‌ఆర్‌ శంకర్‌నాయక్‌ అన్నారు. గురువారం నగరంలోని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాయలంలోని విజయ విఠల్‌ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు వర్క్‌షాప్‌ను ఆయన మొక్కకు నీళ్ల పోసి ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌ ఆర్టీఐ చట్టాన్ని అర్థం చేసుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చాలా మంది ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల సేవలు, పథకాలు అనేక ఇతర సమాచారాన్ని ప్రశ్నించాల్సి ఉంటుంది. అలాంటి వారికి సమాచార హక్కును ఎలా ఉపయోగించాలో తెలియదు.కాబట్టి సమాచార హక్కు చట్టం పరిచయం, పద్ధతులను తెలుసుకోవడానికి ఈ వర్క్‌షాప్‌ అందరికి ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.సమాచార హక్కు రోర్స్‌ పర్సన్‌ హోళగుండి ఎఎంపీ వాగేష్‌ మాట్లాడుతూ చట్టం యొక్క లక్ష్యాలు, ప్రభుత్వ అధికారుల బాధ్యతలు, సమాచార హక్కు చట్టం కింద పౌరుల సమాచారాన్ని ఎలా పొందవచ్చు అన్ని డెలివరీ అధికారులు, క్లరికల్‌ ఉద్యోగులకు తెలియజేశారు. ఆర్టీఐ చట్టం 2005 భారత రాజ్యాంగం అన్ని వ్యక్తులకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయాన్ని నిర్దేశిస్తుంది. సమాచార హక్కు చట్టం 2005 పౌరులు, ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారాన్ని పొందేందుకు అనుమతిస్తుందని అన్నారు.



మొక్కకు నీరు పోసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శంకర్‌నాయక్‌

మోసం కేసు సీబీఐకి అప్పగించాలి : సీపీఎం

హోస్పేట, జూలై 31(ఆంధ్రజ్యోతి):ప్రియాంక మహిళా సహకార సంఘం పేరుతో జరిగిన రూ. 10 కోట్ల మోసం కేసును సీబీఐకి అప్పగించాలనికోరుతూ సీపీఎం తాలూకా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ జాహ్నవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈ కేసులో కవితా ఈశ్వర్‌ సింగ్‌, లలితమ్మ, వెంకటేష్‌, ఆనంద్‌, పట్టిన సహకారి సంఘ నిర్వహణ బోర్డు సభ్యులందరిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ కేసు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్‌ నాయకులు ముఖండ మారడి జంబయ్యనాయక్‌, కార్యదర్శి ఎన్‌ యల్లాలింగ, వి స్వామి, దళిత సంస్థ తాయప్పనాయక్‌, బీ రమేష్‌కుమార్‌, రైతు సంఘం నాయకులు కోటిగి మల్లికార్జున, జనవాది మహిళా సంఘం నాయకురాలు వినోద, గౌరమ్మ, వాణి, సునీత, వందన, మేన, చైత్ర, సంగీత, పద్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కూలీల వాహనానికి ప్రమాదం

●21 మందికి తీవ్ర గాయాలు ●రిమ్స్‌ ఆస్పత్రిలో చేరిక

రాయచూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసేందుకు కూలిలతో వెళుతున్న వాహనం ఒకటి డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురైంది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనలో 21 మందికి పైగా కూలిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో అత్యధికులు మహిళలే కావడం విశేషం. మాన్వి తాలూకానిని కొరవి నుంచి కల్మలాకు నాట్లు వేసేందుకు వెళ్లిన మహిళలు పని ముగించుకుని తిరిగి తమ గ్రామానికి వెళుతుండగా వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో మొత్తం కూలిలు తీవ్ర గాయాల పాలుకాక వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. బాధిత కూలిల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా డ్రైవర్‌ నిర్లక్ష్యంగా అతి వేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు పోలీసులకు వివరించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పుట్టపర్తికి తరలిన బీజేపీ నాయకులు

గోరంట్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ పుట్టపర్తి పర్యటన సందర్భంగా గురువారం గోరంట్ల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌ పిలుపు మేరకు వారు శోభాయాత్రలో వారు పాల్గొన్నారు.

గవిమఠం ఆస్తులను కాపాడుకుంటాం

● మఠం ఉత్తరాధికారి కరిబసరాజేంద్రస్వామి

ఉరవకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని రూ.కోట్ల విలువైన గవిమఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామని గవిమఠం ఉత్తరాధికారి కరిబసరాజేంద్రస్వామి స్పష్టంచేశారు. స్థానిక గవిమఠంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలోని చిత్రదుర్గ్‌ జిల్లా కృష్ణరాజపురంలో దూపదీప నైవేద్యాల కోసం ఇచ్చిన భూమిని అర్చకులు అక్రమంగా వారిపేరు మీదకు మార్చుకున్నట్లు గుర్తించామని, రెవెన్యూ అధికారులకు ఆధారాలు చూపించి ఆ ఆస్తిని ఉరవకొండ గవిమఠం సంస్థానానికి చెందినదిగా నిరూపించామని అన్నారు. ఆ అర్చకులు పేరు మీద ఉన్న ఆ భూమిని గత నెల 15న ఉరవకొండ గవిమఠం పేరును మార్చామన్నారు.

పెళ్లయినా ప్రేమించాలని

వేధింపులు

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెళ్లయినా వేధింపులకు గురి చేశాడా ఆ వ్యక్తి. అంతే కాక తన మాట వినకపోతే తనతో ఉన్న ఫొటోలు సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేశాడు. వేధింపులు తాళలేక ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వివాహితుడి వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తుమకూరు జిల్లాలో చోటు చేసుకుంది. గుబ్బితాలూకా గ్యారహళ్ళి గ్రామానికి చెందిన భావన(22) నెలమంగళలోని చిన్నమ్మ ఇంట్లో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గ్యారహళ్ళికి చెందిన నవీన్‌ కు ఇప్పటికే పెళ్ళి జరిగింది. కానీ భావనను ప్రేమించాలని వేధిస్తుండేవారు. గతంలో ఇద్దరు తీసుకున్న ఫొటోలను సోషల్‌ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరింపులకు పాల్పడుతుండటంతో భావన భయపడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భావన మైసూరులో చదువుతున్న వేళ తండ్రి తరచూ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపేవారు. తండ్రి వద్ద ఫోన్‌పే లేని కారణంగా ఇదే గ్రామానికి చెందిన నవీన్‌ మొబైల్‌ ద్వారా ఆయన డబ్బు పంపేవారు. ఇలా సేకరించిన ఫోన్‌ నంబరుతో నవీన్‌ తొలుత స్నేహం పెంచుకున్నారు. అప్పట్లో ఇద్దరు కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఇటీవల చదువు ముగించుకుని వచ్చిన భావన స్థానికంగా ఉండే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. నవీన్‌తో స్నేహం ఇష్టం లేదని చెబుతున్నా పట్టించుకోక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ జరిపి మరోసారి వేధిస్తే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. అయినా నవీన్‌ నిత్యం ఇబ్బంది పెడుతుండేవారని అదే కారణంతోనే భావన బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. నెలమంగళ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ప్రకటించారు. కాగా నవీన్‌ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లికి ముందు హెచ్‌ఐవీ పరీక్షలు

● ప్రముఖ వైద్యుడు భరత్‌రాజ్‌ పి.యాళగి



బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : పెళ్ళికి ముందే హెచ్‌ఐవీ పరీక్షలు తప్పనిసరి చేయాలనే చట్టం తీసుకురావాలని హుబ్బళ్ళికి చెందిన ప్రముఖ వైద్యులు భరత్‌రాజ్‌ పి యాళగి రెండోసారి ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్ళ కిందటనే ఇటువంటి ప్రస్తావన ఒకటి వచ్చిందనే విషయం వెలుగులోకి వచ్చింది. మేఘాలయ ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కర్ణాటకలో అమలులోకి తీసుకువస్తే దేశంలోనే తొలి సాధన కానుందన్నారు. 1996-97లో పెళ్ళికి ముందే హెచ్‌ఐవీ పరీక్షలు జరిపేందుకు తగిన బిల్లును ప్రైవేటు రూపంలో తీసుకువచ్చేందుకు అప్పటి విధానపరిషత్‌ సభ్యులు హెచ్‌కె పాటిల్‌ తీసుకురావాల్సి ఉండేదన్నారు. 2005లో ధరంసింగ్‌ ప్రభుత్వంలో హెచ్‌కే పాటిల్‌ మంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తావించానన్నారు. కొన్ని కీలక అంశాలతో చట్టం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. కానీ రాజకీయ కారణాలతో సాధ్యం కాలేదన్నారు. విద్యాపరంగా అభ్యుదయ అభిప్రాయాల దృష్టితో రాష్ట్రంలో ఇప్పుడైనా బిల్లును తీసుకురావాలని కోరారు. ఇటీవలే శాసనసభా వ్యవహారాలు, న్యాయశాఖా మంత్రి హెచ్‌కె పాటిల్‌తె ఇటీవలే చర్చలు జరిపినట్లు తెలిపారు. మరో పది రోజులలో జరిగే శాసనసభ సమావేశాలు లేదా చలికాలం వేళ అయినా బిల్లును తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలతో పోల్చినా హెచ్‌ఐవీ సమాజంలో పూర్తిగా తొలగలేదన్నారు. పైగా వ్యాధిని పూర్తిగా నియంత్రించే మందులు రాలేదన్నారు. పెళ్ళికి ముందు హెచ్‌ఐవీ పరీక్షలు జరిపించడం అనే ప్రక్రియలో ఎటువంటి తప్పు లేదన్నారు. ముందుగా జబ్బును తెలుసుకోవడం ద్వారా భాగస్వామికి ప్రత్యేకంగా పుట్టబోయే చిన్నారులకు జబ్బు నుంచి రక్షించినట్లు అవుతుందన్నారు. 1992 నుంచి వివిధ జబ్బులతో వచ్చే రోగులకు వారి బంధువులకు హెచ్‌ఐవీ గురించి చైతన్యం తీసుకువచ్చానన్నారు. అప్పట్లో తన ఆలోచనలను అపహాస్యం చేశారన్నారు. దేశంలో ఎయిడ్స్‌ ప్రభావం ఎంతస్థాయికి తీసుకెళ్ళిందనేది అందరికీ తెలిసిందే అన్నారు. ఓ డాక్టర్‌గా కనీసం 500 పెళ్ళిళ్ళను నిలిపివేశానన్నారు. పెళ్ళి పత్రికలతో వచ్చే వారికి పలు విధాలుగా చైతన్యం కలిగించి పరీక్షలు జరిపించి రద్దు చేయించానన్నారు. కనీసం పదివేల మందికి వ్యాధి పట్ల చైతన్యం కలిగించామన్నారు. పెళ్ళికి మూడు నెలల ముందే పరీక్షలు జరిపించుకోవాలని సూచిస్తానన్నారు. తద్వారా నిశ్చితార్థం వంటి ప్రక్రియలు జరుగవన్నారు. వ్యాధి ఉన్నట్లు తేలితే పెళ్ళికి దూరంగా ఉండటం ద్వారా ఒకరిని వ్యాధి నుంచి జీవిత కాలం కాపాడినట్లే అన్నారు. ప్రస్తుతం మేఘాలయ, గోవా, ఆంధ్రప్రదేశ్‌, పాండిచ్చేరిలలోను ఇటువంటి చట్టంతీసుకు వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పెళ్ళికి ముందు ఒక్కరే కాదని వధూవరులు ఇద్దరూ పరీక్షలు జరిపించుకోవాలన్నారు, పెళ్ళికి ముందు చదువు, ఉద్యోగం, ఆస్తుల వంటి విషయాలకు ఎంతగా ప్రాధాన్యం ఇస్తారో అంతకంటే ఆరోగ్యానికి కూడా ఉండాలనేది తన ఆశయమన్నారు.



శివమొగ్గ జిల్లా ఎమ్మెల్యేల సమీక్షలో సీఎం, మంత్రి మధుబంగారప్ప

అన్ని సమస్యలు పరిష్కరిస్తా : సీఎం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాలలో చేపట్టదలచిన అత్యావసర సమస్యలు ఉంటే చెప్పాలని పరిష్కరిస్తానని సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. గురువారం విధానసౌధలో మూడోరోజున వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌ మంత్రులతో సమీక్షలు జరిపారు. ఉదయం విజయపుర, బాగల్‌కోట, గదగ, హావేరి, శివమొగ్గ జిల్లాలలోను మధ్యాహ్నం దావణగెరె, చిత్రదుర్గ, చిక్కమగళూరు, చిక్కబళ్ళాపుర జిల్లాల సమీక్షలు జరిపారు. శివమొగ్గ జిల్లా సదస్సులో మంత్రి మధు బంగారప్పతో పాల్గొన్నారు.



సహాయక చర్యల్లో పోలీసులు

సంపంగిరామనగర్‌లో కుప్పకూలిన భవనం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): బృహత్‌బెంగళూరు మహానగర పాలికె వెనుకభాగాన సంపంగిరామనగర్‌లో గురువారం మధ్యాహ్నం ఓ భవనం కుంగిపోయింది. వెంటనే స్థానికులు అప్రమత్తమై పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు రంగంలోకి దిగి భవనం కింద కూరుకుపోయిన ఇంటి యజమానిని రక్షించారు. సుమారు 50 ఏళ్ళకు పైబడిన భవనంలో నీటి నిలువ కోసం సంపు తవ్వుతుండగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉంటారనే కోణంలో సహాయక చర్యలు కొనసాగించారు. ఇంట్లో కుటుంబ సభ్యులందరూ లేని సమయంలో ప్రమాదం జరుగడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.



ఆందోళనలో ఇంటి సభ్యులు

ఢిల్లీకి వేర్వేరుగా సీఎం, డీసీఎం పయనం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగే బ్రిడ్జ్‌టు బెంగళూరు సదస్సులో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ వెళుతున్నారు. ఒకే సమావేశం అయినా ఎవరికి వారుగానే వెళ్ళేలా షెడ్యూలు ఖరారైంది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం ఉదయం 11.45 గంటలకు దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్నారు. మధ్యాహ్నం 2.40గంటలకు ఢిల్లీకు చేరుకుని సాయంత్రం సమావేశంలో పాల్గొంటారు. ఇక డీసీఎం డీకే శివకుమార్‌ ఉదయం 9.45గంటలకే దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్నారు. మధ్యాహ్నం 12.10గంటలకే ఢిల్లీకు చేరుకుంటారు. సాయంత్రం బ్రిడ్జ్‌టు బెంగళూరు సభలో పాల్గొంటారన్నారు. కాగా ఇద్దరు నేతలు శనివారం ఎఐసీసీ లా విభాగం ఏర్పాటు చేసిన హ్యూమన్‌రైట్స్‌ ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్‌ సభలో పాల్గొంటారు. ఇద్దరు నేతలు వెనుతిరిగి వచ్చే షెడ్యూలు ఖరారు కాలేదు. మూడురోజులుగా ఎమ్మెల్యేల సమీక్షను సీఎం సిద్దరామయ్య మాత్రమే నిర్వహిస్తున్నారు.

భర్తను అప్పుల వారు వేధిస్తున్నారని...



నదిలో దూకిన మహిళను రక్షిస్తున్న అగ్నిమాపక అధికారులు

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : అప్పులు ఇచ్చిన వారు భర్తను వేధిస్తున్నారని జీర్ణించుకోలేని భార్య ఆత్మహత్యకు ప్రయత్నించి నదిలో దూకేశారు. అయితే నది మధ్యన బండరాయి వద్ద ఓ చెట్టుకొమ్మ తగులుకుని ఉండటంతో దానిని పట్టుకుని రాత్రంతా గడిపారు. గురువారం ఉదయం అగ్నిమాపక శాఖ, పోలీసులు ఆమెను ఎట్టకేలకు రక్షించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా కోటిహాళ గ్రామానికి చెందిన రూప అమ్లెర్‌ అనే 40 ఏళ్ళ మహిళ బుధవారం సాయంత్రం తుంగభద్ర నది చెంతకు బట్టలు ఉతికేవారిలా వెళ్ళి నదిలో దూకేశారు. ఆమెకు ఈత వస్తుండటంతో సుమారు కిలోమీటరు దూరం దాకా వెళ్ళాక నది మధ్యన ఓ చెట్టుకొమ్మును పట్టుకున్నారు. గురువారం ఉదయం ఆమె కేకలు వేస్తుండగా స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారులు నది చెంతకు చేరుకుని బోటు ద్వారా వెళ్ళి ఆమెను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. వెంటనే ఆమెను రాణిబెన్నూరు తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1642.83	1,631.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	52,878	52,414
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	51,317	63,419
నీటి నిల్వ (టీఎంసీలు)	75.93	99.70



క్లోరిన్ సిలిండర్లు నిల్వ ఉంచిన గోడౌన్

క్లోరిన్ సిలిండర్ లీక్

● 13మందికి అస్వస్థత



క్లోరిన్ సిలిండర్

బళ్లారి గాంధీనగర్, జూలై 31(ఆంధ్ర జ్యోతి): క్లోరిన్ సిలిండర్ లీక్ అయిన ఘటనలో 13మంది అస్వస్థత చెందిన ఘటన కూడ్లిగి పట్టణంలో చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కూడ్లిగి పట్టణంలో కొత్త చర్చికి వెళ్తున్న సమయంలో ఆ మార్గం గుండావెళుతున్న క్లోరిన్‌తో కూడిన గాలినిపీల్చి అస్వస్థతకు గురి అయ్యారు. పట్టణ పంచాయతీకి చెందిన ఓ గోడౌన్‌లో సుమారు 15 సంవత్సరాల క్రితం ఈ క్లోరిన్ సిలిండర్‌ను అలాగే ఉంచడంతో సిలిండర్ దెబ్బతిని లోపల ఉన్న క్లోరిన్ బయటి గాలితో కలిసింది. దీంతో బయటి గాలి విషతుల్యమైంది. ఆ మార్గం గుండా వెళ్ళే వారు ఈ గాలిని పీల్చడంతో అస్వస్థతులకు గురైనట్లు ప్రాథమిక విచారణలో వైద్యులు గుర్తించారు. 15 సంవత్సరాల నుంచి ఎందుకు ఈ సిలిండర్‌ను ఉపయోగించలేదని స్థానిక ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. క్లీనింగ్ కోసం క్లోరిన్ సిలిండర్‌ను గోదాములో అలాగే ఉంచడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. సిలిండర్‌ను తొలగించేందుకు ఆగురు అగ్నిమాపక సిబ్బంది, ఒక హోంగార్డ్, పంచాయతీ సిబ్బంది, ఐదుగురు సభ్యులు కూడా అస్వస్థతకు గురయ్యారు. విధిలేక భద్రతా సిబ్బంది గోడౌన్ గోడలను పగుల గొట్టి సిలిండర్లను వెలికి తీసి ఊరి అవతకు పడేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి తహసీల్దారు వీకే నేత్రావతి, డీవైఎస్పీ మల్లేష్ దొడ్డమని, సీపిఐ ప్రహ్లద్ ఆర్. చెన్నగిరి, పీఎస్ఐ సి.ప్రకాష్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

బాలికపై అత్యాచారయత్నం

● వృద్ధుడిపై పోక్సో కేసు

రాయచూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకాలోని ఓ గ్రామంలో బాలిక పై అదే గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు హుచ్చప్ప అత్యాచారానికి యత్నించాడు. గురువారం బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై సిరవార పోలీసులు కేసు నమోదు చేశారు. తన మనవడి స్నేహితురాలైన ఆ బాలిక తమ ఇంటికి వచ్చిన సందర్భంలో ఎవ్వరూ లేని సమయంలో బాలిక పై హుచ్చప్ప అత్యాచారం చేసేందుకు యత్నించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ



సమావేశానికి హాజరైన కమ్మ సంఘం నాయకులు

ఎన్టీఆర్.. జనం గుండెల్లో ఉంటారు

● నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్



మాట్లాడుతున్న టీడీ జనార్దన్

బళ్లారి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సూర్యచంద్రులు, రామాయణ, మహాభారతాలు ఉన్నంతకాలం నందమూరి తారక రామారావు జనం గుండెల్లో జీవించి ఉంటారని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. ప్రపంచ దేశాల్లో ఏ నటుడూ నటించలేనన్ని పాత్రలను ఎన్టీఆర్ నటించారని కొనియాడారు. బళ్లారి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటిన్ సేవలను గుర్తించి, అభినందించేందుకు గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ కృష్ణా జిల్లా సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ కడుపున పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని రామకృష్ణ అన్నారు. తెలుగు భాషకు ఆయన ప్రపంచ దేశాల్లో గుర్తింపు తెచ్చారని అన్నారు. బళ్లారిలో ఎన్టీఆర్ పేరుతో నిత్యాన్నదానం చేయడం సంతోషకరమని టీడీ జనార్దన్ అన్నారు. ఎన్టీఆర్ చెప్పిందే చేసేవారని, చేసేదే చెప్పేవారని అన్నారు. అన్నగారి చరిత్ర ఈ సృష్టి ఉన్నతం వరకూ ఉంటుందని అన్నారు. ఎన్టీఆర్ చరిత్రను రాబోవు తరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. సినిమాల్లో, రాజకీయాల్లో తన ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు. ప్రపంచ సినీ చరిత్రలో 450 పాత్రల్లో, అనేక భాషల్లో నటించిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఇప్పుడు ఉండే హీరోలు సినిమాల్లో డిమాండ్ తగ్గితే రాజకీయాల్లోకి వస్తారని, కానీ ఎన్టీఆర్ అలా కాదని అన్నారు. సినిమాల్లో మంచి క్రేజ్ ఉన్నప్పుడే రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి అని కొనియాడారు. ఎన్టీఆర్ 40 ఏళ్ల క్రితమే ఆహార భద్రత, పింఛన్లు మంజూరు, పక్కా గృహాలు కట్టించడం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం నాయకుడు కొత్తపల్లి తిమ్మరాజులు, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, ముల్లంగి చంద్రశేఖర్, కోనంకి రామప్ప, గుర్రం లాల్‌మోహన్ చౌదరి, దామోదర్ చౌదరి, జి.ప్రభాకర్‌నాయుడు, టి.బాబూ ప్రకాష్, ఎం.రమేష్ బాబు, మోదుపల్లి సుబ్బరాయుడు, ఎస్.వెంకటనాయుడు, మేయర్ నందీష్ బాబు, కార్పొరేటర్లు విక్కీ, రామాంజినేయులు, రాజశేఖర్, డి.పుల్లయ్య, ఉమేష్, బుడుగు నాగేశ్వరరావు, కమ్మసంఘం నాయకులు, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు మునుపు నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌కు బళ్లారిలో కమ్మ మహాజనసంఘం నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్‌కు జైకొట్టారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఎరువుల ధర పెంపుపై నిరసన

కంప్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచడాన్ని ఖండిస్తూ కంప్లి నియోజకవర్గ, బ్లాక్ యువజన కాంగ్రెస్ కమిటీ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మంజునాథనాయక్‌కు మనవిపత్రం సమర్పించారు. అచ్చాదిన్ ఆయేగా అని చెప్పుకుంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఆవిర్భావం నుంచి సామాన్య ప్రజలపై దాడి చేస్తోందని కంప్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ అన్నారు. ఇప్పుడు రైతులకు పంటల కోసం పంపిణీ చేసే ఎరువుల ధరల పెంపును యువజన కాంగ్రెస్ యూనిట్ తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ సంవత్సరం ఎరువుల ధర గత సంవత్సరంతో పోల్చితే పెరిగింది. ఇది రైతులకు చాలా సమస్యలను కలిగించింది. ఎరువుల ధరలను పెంచుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతులపై బాధను ప్రయోగిస్తోందన్నారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్రానికి పట్టడం లేదన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు బట్టప్రసాద్, స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్, సభ్యులు సీఆర్ హనుమంత, వీరాంజనేయులు, ఏపీఎంసీ అధ్యక్షులు హబీబ్ రెహమాన్, కంప్లి బ్లాక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గురు, సిద్దప్ప, మనోహర్, రఘునాయక్, జాఫర్, పెయింటర్ మస్తాన్ పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ ఖాసీం

సిరుగుప్ప, జూలై31(ఆంధ్రజ్యోతి) : డెంగీ వ్యాధి పట్ల విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ సూచించారు. గురువారం తాలుకాలోని దాసాపుర గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఆస్పత్రి విద్యాశాఖ ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణపై పాటించాల్సిన జాగ్రత్తలను వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల బెడద వలన వస్తుందని తెలిపారు. దోమతెరలు కట్టుకుని రాత్రివేళల్లో నిద్రపోవాలని ఆయన సూచించారు. ఇళ్లల్లో డ్రమ్ముల్లో నీటిని చాలా రోజులు నిల్వ వుంచరాదన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న అధికారులు



పగిలిన ఏటీఎం అద్దాలు

బళ్లారి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని తాళ్లూరు రోడ్డు రెడ్డి హోటల్స్ సమీపంలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి ప్రయత్నించారు. ఇటుక పెళ్లలతో దాడి చేయడంతో ఏటీఎం అద్దాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి ఏటీఎం పై ఇటుకతో దాడి చేసి, ఏటీఎం అద్దాలను పగులగొట్టే ప్రయత్నం చేయగా రాకపోవడంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎటువంటి డబ్బు పోలేదని పోలీసులకు బ్యాంకు అధికారులు తెలిపారు. అయితే ప్రధాన రహదారిలో సీసీ కెమెరాలు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. కెమెరాలు లేకపోవడంతోనే నిందితుల గుర్తింపు కష్టంగా మారిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కోలాహలంగా బోర్డు ఎన్నికలు



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల సందడి

హోస్పేట, జూలై31(ఆంధ్రజ్యోతి):నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో కురుహిన్ శెట్టి సమాజ్ సెంట్రల్ అసోసియేషన్ నిర్వహణ బోర్డు ఎన్నికలు గురువారం కోలాహలంగా జరిగాయి. దాదాపు 40సీట్లకు జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్, కళ్యాణ్‌నగర్, కల్బుర్గి, సుదూర జిల్లాల నుంచి ఓటర్లు, మహిళలు పాల్గొన్నారు. కల్బుర్గి డివిజన్ రిజర్వ్ స్థానానికి ఓటు వేయడానికి వచ్చారు. రాజకీయ నాయకుడు బీ లింగేశ్వరకు ఎక్కువ మద్దతు లభించడం కనిపించింది.

తుంగభద్రకు వరద తగ్గుముఖం

● ఐదు క్రస్ట్‌గేట్లకు కుదించిన బోర్డు అధికారులు

బళ్లారి గాంధీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తుంగభద్ర నుంచి బుధవారం వరకు 20క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం కేవలం ఐదు క్రస్ట్‌గేట్లకు పరిమితం చేశారు. ప్రస్తుతం రెండు క్రస్ట్‌గేట్లను 5 అడుగులు చొప్పున ఎత్తి ఒక్కో గేటు నుంచి 5,326 క్యూసెక్కులు, మరో మూడు గేట్లను 3.5 అడుగుల మేర ఎత్తి ఒక్కో గేటు నుండి 3,870 క్యూసెక్కుల చొప్పున మొత్తం 22,262 క్యూసెక్కులు నదికి విడుదల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో గురువారం మధ్యాహ్నం 12గంటల నాటికి జలాశయంలో నీరు 1624.83 అడుగులకు చేరగా, జలాశయంలో 75.93టిఎంసి నీటికి పరిమితం చేశారు.

బళ్లారి నగరాభివృద్ధికి రూ.50 కోట్లు

సీఎం, డీసీఎంకు కృతజ్ఞతలు: ఎమ్మెల్యే నారా



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు రూ.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ఇందుకు సహకరించిన సీఎం సిద్దరామయ్యకు కృతజ్ఞతలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 20250-26 బడ్జెట్‌లో ముఖ్యమంత్రి ఈ నిధులను ప్రకటించారని తెలిపారు. బళ్లారి నగరంలో మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు ఉపయోగిస్తామన్నారు. ఇందుకు సీఎం సిద్దరామయ్యకు, డిప్యూటీ సీఎం డి.కే శివకుమార్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు నగరంలో చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈపనులు త్వరలో ప్రారంభిస్తామని ప్రకటనలో తెలిపారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



మంత్రి జార్కెహోళికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 150 అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు, బెంగళూరులో మంత్రి సతీష్ జార్కెహోళిని కోరారు. గురువారం మంత్రితో భేటీ అయిన ఎమ్మెల్యే సిరుగుప్ప పట్టణంలో ఎన్‌హెచ్ 150 పనులు ప్రారంభించి మూడేళ్లయినా ఇంత వరకు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారన్నారు. 11 కిలోమీటర్లలో మూడు కిలోమీటర్ల పనులు మాత్రం అరకొరగా జరిగాయని మిగిలిన ఎనిమిది కిలోమీటర్ల పనులు జరుగలేదు. దీంతో ఈ రహదారిపై ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవించాయని ఆయన తెలిపారు. రహదారి పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. తక్షణమే ఈ రహదారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నిందితుల అరెస్ట్..11 బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న పోలీసులు

కంప్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): కంప్లి పోలీసులు విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి ఇటీవల దొంగలించబడిన రూ.9 లక్షల విలువైన 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కంప్లి ఎస్‌ఐ వాసుకుమార్, పీఎస్‌ఐ అవినాష్ కాంబాలే తెలిపిన మేరకు గురువారం ఉదయం 11.30 గంటలకు కంప్లిలోని కురుగోడు రోడ్డులోని కమ్మభవన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా దొంగలించబడిన మోటారు సైకిల్ నిందితులు దినేష్, యశ్వంత్‌లను అరెస్టు చేసి విచారించారు. వారితో పాటు కంప్లి పట్టణానికి చెందిన కార్తీక్, కృష్ణ, మైత్రి, బాషా రూ. పది లక్షలు విలువైన 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోను, కంప్లి పట్టణం, కొప్పాళ్ జిల్లాలోని అంజనాద్రి బెట్ట తుమకూరు బస్ స్టేషన్, చిత్రదుర్గ బస్‌స్టేషన్, దమ్మూరు గ్రామం సింధనూరు, అంబామఠం, విడపనకల్లు, తోరణగల్లు, మునీరాబాద్ రైల్వే స్టేషన్‌ల వద్ద ఏడాది కాలంగా రూ. 9 లక్షలు విలువైన బైకులు చోరీకి గురయ్యాయి. దొంగలించబడిన మోటారు సైకిళ్ల నిందితులను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో తోరణగల్లు సబ్ డివిజన్ డీఎస్పీ ప్రసాద్ గోఖలే ఆధ్వర్యంలో కంప్లి సీఐ వాసు కుమార్, అవినాష్ కాంబ్లే, ఏఎస్‌ఐ బసవరాజు, హెడ్ కానిస్టేబుల్ బసవరాజు ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు: ఎమ్మెల్యే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): అత్యంత పేదరికంతో నిండిన సమాజంలో విద్య ద్వారా మాత్రమే మార్పు సాధ్యమని, అందుకు అందరూ చొరవ చూపాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అన్నారు. గురువారం బళ్లారి రోడ్డులోని హెరిటేజ్ వెనుక ఉన్న గిరిజన మేదరకేతర సంఘ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తితో పాటు, వివిధ పదవులు నిర్వహించాలన్నారు. పిల్లలకు విద్యను అందించడంతో పాటు మంచి సంస్కృతి, నైతికతను పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనది. ఆధునిక దేశంలో మొబైల్, వాట్సాప్, ఫేస్‌బుక్ ప్రబలంగా ఉన్నాయి. పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడానికి బదులుగా పుస్తకాలు ఇవ్వడం వారి జ్ఞాన స్థావరాన్ని పెంచుతుంది. గిరిజన సమాజ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయం, సహకారం వుంటుందన్నారు. మేదర కేతయ సంఘ కార్యదర్శి గాలికుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యేల సహకారంతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని ఆయనన్నారు. తరువాత ఎమ్మెల్యే గణేష్ వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, మున్సిపల్ అధ్యక్షులు బట్టప్రసాద్, సభ్యులు సీఆర్ హనుమంతు, ఏపీఎంసీ అధ్యక్షులు హబీబ్ రెహమాన్, కార్యనిర్వాహక ఆర్‌కే శ్రీకుమార్, సహాయ సంచాలకులు మల్లనగౌడ్, గిరిజన మేదర కేతయ్య సంఘం ఉపాధ్యక్షులు, కటేశ, ఎం రామన్న, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శివన్న, నాయకులు రామన్న, తిమ్మప్ప, గంగప్ప, మల్లప్ప, క్షేత్ర సంఘం అధ్యక్షులు బాలే మల్లి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



నిరసనలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఫ్లైఓవర్ నాణ్యతపై సీపీఎం నిరసన

హోసూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న ఫ్లై ఓవర్‌పై పగుళ్లు ఏర్పడి నెలరోజులైనా బాగు చేయడంలో జాప్యం జరుగుతోందని, నాణ్యతను పరిశీలించాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం ఉదయం ప్రజలను ఆకర్షించేలా భారీ నిరసన నిర్వహించారు. హోసూరు - బాగలూరు రోడ్డులోని జీఆర్‌టీ సమీపాన నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ 15సంవత్సరాలక్రితం నిర్మించిన ఫ్లై ఓవర్ నాణ్యతలో లోపాలు ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. నెలక్రితం పగుళ్లు ఏర్పడ్డాయని మరమ్మతులు చేసేందుకు ఎందుకు ఇంత జాప్యం అని ప్రశ్నించారు. పగుళ్ల కారణంగా తాత్కాలికంగా ట్రాఫిక్‌ను మళ్లించారని, తద్వారా అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నెలకొంటోందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇకనైనా ఉన్నతాధికారులు తగిన చొరవ చూపాలని డిమాండ్ చేశారు. నిరసనలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: మంత్రి



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి చక్రపాణి

హోసూరు (కృష్ణగిరి), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి 'స్టాలిన్ విత్ యు' పేరిట గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు పౌర, ఆహర సరఫరాలశాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. 'స్టాలిన్ విత్ యు' పేరిట కడికనపల్లి గ్రామపంచాయతీ సముదాయ భవనంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా పదిహేను రోజుల్లో ఇంతవరకు 42 గ్రీవెన్స్ శిబిరాలు జరిగాయని ఇంతవరకు 32,133 అర్జీలు వచ్చాయన్నారు. దశలవారీగా శాఖలవారీగా అర్జీలు పరిష్కారం అవుతున్నాయన్నారు. కాగా గ్రీవెన్స్ శిబిరంలో ఆయాశాఖలకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల అర్జీలను కంప్యూటర్‌లో నమోదు చేసి పరిశీలన చేపట్టారు. ప్రధానంగా మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో మహిళల ఉచిత ప్రయాణం కోసం పాతబస్సుల స్థానంలో 9 కొత్త బస్సులకు పచ్చజెండా చూపారు. రూట్లను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలు ఏర్పాటు చేశారు. కావేరిపట్టణ పంచాయతీలో రూ.53లక్షలతో నిర్మించిన రోజువారీ మార్కెట్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, బర్గూరు ఎమ్మెల్యే మథియలగన్, హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తూ..

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలి

● జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ

రాయచూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల వారిగా పన్ను వసూళ్లల్లో నిర్లక్షాన్ని వీడి లక్ష్యం చేరుకోవాలని జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహించిన తాలూకా పంచాయతీ అధికారులు, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులను తీవ్ర స్థాయిలో మందలించారు. గురువారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో తాలూకా పంచాయతీ ఈఓ, పీడీఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జడ్పీ సీఈఓ జిల్లాలో 179 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్త 420 కోట్లకుపైగా పన్ను వసూళ్లు పెండింగ్‌లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేని చోట జలజీవన్ మిషన్ ద్వార అవకాశం కల్పించాలన్నారు. శిథిలమైన వంట గదుల స్థానంలో ఉపాధి హామి నిధుల ద్వార వాటిని పునరుద్ధరించడం లేదా మరమ్మత్తులు చేపట్టడం పనుల వెంటనే చేపట్టాలన్నారు. ఇందుకు సంబందించి విద్య శాఖ అధికారులు గ్రామ పంచాయతి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ